క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన


అన్నప్రాసన చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

దహెగాం: మండలంలోని అమరగొండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త వజ్రమ్మ మాట్లాడుతూ పోషణ మాసం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులకు బాలామృతం అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

డార్ఫ్ వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కనక యాదవరావు

జైనూర్: హైమన్ డార్ఫ్ వర్ధంతి కార్యక్రమానికి ప్రతీ ఒక్కరు తరలిరావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో డార్ఫ్ వర్ధంతికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుడ్మేత విశ్వనాథ్, కమిటీ సభ్యులు కుమ్ర దుందేరావు, మండాడి లింగు, సార్మేడి జుగ్నక దేవురావు, ఉప సార్మేడి ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న పర్శరాములు

కెరమెరి: ఇటీవల మండలంలోని ఖైరీ గ్రామంలో విద్యుత్‌షాట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన స్వాతి కుటుంబానికి శుక్రవారం కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పర్శరాములు రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. స్వాతి కెరమెరిలో ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్ చదువుతుండగా, విద్యా అవసరాల నిమిత్తం నగదు అందించి తన ఉదారత చాటుకున్నారు.

'పౌష్టికాహారంపై అవగాహన పెంపొందించుకోవాలి'

తాండూర్: పిల్లలకు అందించే పౌష్టికాహారంపై తల్లులు అవగాహన పెంపొందించుకోవాలని బెల్లంపల్లి సీడీపీవో ఉమాదేవి అన్నారు. మండలంలోని మాదారం త్రీ ఇన్‌క్లైయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో సామాజిక వేడుకల్లో భాగంగా చిన్నారులకు శుక్రవారం సామూహిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ ఆరునెలల దాటిన పిల్లలకు అదనపు పౌష్టికాహారం అందించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, సర్పంచ్ గాజుల సుజాత, అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, తిరుమలేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నెన్నెల: మండలంలోని గంగారాంలో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, డయల్ 100పై గ్రామస్తులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్‌నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత బ్యాంక్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఆపదలో ఉన్నవారు మహిళలు, యువతులు 100కు డయల్ చేస్తే వెంటనే పోలీసులు వచ్చి కాపాడుతారన్నారు. సర్పంచ్ సుధ, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్కె బాజీసైదా, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం వారు సీహెచ్‌పీని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులు వారి ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఉద్యోగుల వృత్తిపరమైన సమస్యలతోపాటు దుమ్ము సమస్య పరిష్కరించాలన్నారు. ఇంకా ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కార్మికులకు హామీఇచ్చారు. అనంతరం నూతనంగా గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఇరువురి నాయకులను మైసమ్మ ఆలయ కమిటీ నాయకులు వారిని సన్మానించారు.

'వంట' బిల్లులు అందేదెప్పుడు?

- ఐదు నెలలుగా అందని మధ్యాహ్న భోజన బిల్లులు
- ఇబ్బందులు పడుతున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు


విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎండీఎం నిర్వాహకురాలు

ఆసిఫాబాద్‌రూరల్: సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకొచ్చింది. విద్యార్థులకు ప్రతీరోజు భోజనం వండి పెడుతున్న కార్మికులు వంట బిల్లులు రాక, వేతనాలు అందక అష్టకష్టాలు పడుతున్నారు. ఆగస్టు నుంచి మధ్యాహ్న భోజనం వంట బిల్లులు, సెప్టెంబర్ నుంచి సీఎం బ్రేక్‌ఫాస్ట్ బిల్లులు, కోడి గుడ్డు బిల్లులు, ఏడు నెలల నుంచి గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేసి మరీ విద్యార్థులకు వండి పెడుతున్నామని వంట నిర్వాహకులు వాపోతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 684 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 535, ప్రాథమికోన్నత పాఠశాలలు 98, ఉన్నత పాఠశాలలు 51 ఉండగా వీటిల్లో 40,722 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు ప్రతీరోజు వంట చేస్తున్నారు. 9, 10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10.65 లు, 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు రూ.8.65లు, 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు రూ.6.85ల చొప్పున ప్రభుత్వం అందిస్తుంది. కానీ సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో గత 5 నెలల నుంచి వంట బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు ఇటీవల సీఎం బ్రేక్‌ఫాస్ట్ పేరుతో ఉదయం టిఫిన్ కోసం ఒక్కో విద్యార్థికి రూ.10.50లు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటి వరకు కూడా టిఫిన్ బిల్లులు సైతం అందలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట సామగ్రిని కిరాణ దుకాణంలో ఉద్దెర తీసుకొస్తున్నామని, బిల్లులు లేక రాకపోవడంతో సరుకులు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. దీంతో అప్పులు చేసి మరీ వంట సామగ్రి తీసుకుంటున్నామని పేర్కొంటున్నారు.

బిల్లులు రాక ఇబ్బందులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు గౌరవ వేతనాలు, భోజన బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 1375 మంది వంట కార్మికులు గౌరవ వేతనాలు, భోజనం బిల్లులు రాక తిప్పలు పడుతున్నారు. దీంతో ఆర్థికంగా అనేక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. ప్రస్తుతం కూరగాయలు, వంట నూనె, పప్పు, కోడిగుడ్లుకు రేట్లు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వం చెల్లించే రూపాయలు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు, బిల్లులు చెల్లించడంతో పాటు ప్రస్తుతం రేట్ల ప్రకారం బిల్లులు పెంచాలని కోరుతున్నారు.

అప్పులు చేస్తున్నాం



గత మూడు నెలల నుంచి మధ్యాహ్న భోజనం బిల్లు రాలేదు. దీంతో కిరాణషాపు యజమాని కూడా పాత బిల్లు చెల్లిస్తేనే సరుకులు ఇస్తామంటు న్నారు. దీంతో చేసేదేం లేక వడ్డీకి డబ్బులు తెచ్చి సరుకులు కొనుగోలు చేస్తున్నాం.

- కమల, ఎండీఎం కార్మికురాలు

అధికారులు చొరవ తీసుకోవాలి

రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మాకు కూడా బిల్లులు పెంచాలి. సకాలంలో వేతనాలు, బిల్లులు అందక పోవడంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలి.

- సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు, ఎండీఎం నిర్వాహకుల సంఘం

కొనసాగుతున్న 'ప్రజాపాలన'


ఆసిఫాబాద్‌రూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ


కెరమెరి: మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతీ ఒక్కరు ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం మండలంలోని పర్శనంబాల, రహపల్లి గ్రామంలో ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ దరఖాస్తులు చేసుకునేందుకు చివరి రోజని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎంపీడీవో శశికళ, ఏపీవో చంద్రశేఖర్, సర్పంచ్ శ్రీనివాస్, కిష్టయ్య, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: గ్రామాల్లోని అన్ని కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఎంపీడీవో మహేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రంధోళి, కెలిబి, నిషాని, ముకదంగూడ గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ప్రజాపాలనలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుటుంబానికి సంబంధించిన అన్ని విషయాలు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమాల్లో డెప్యూటీ తహసీల్దార్ రాజలింగు, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

జైనూర్: గత నెల 28 నుంచి ప్రజల నుంచి స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించినట్లు ఎంపీడీవో ప్రభుదయ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఆన్‌లైన్ నమోదు చేపట్టారు. మోహన్, గౌతమ్ తదితరులు ఉన్నారు.

కౌటాల: ఆరు గ్యారెంటీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 10694 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి, ఎంపీడీవో నస్రుల్లాఖాన్ తెలిపారు.

వాంకిడి: మండలంలో ప్రజాపాలన గ్రామ సభలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండలంలోని పిప్పర్‌గోంది, చౌపన్‌గూడ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో తహసీల్దార్ రహీముద్దీన్ పాల్గొన్నారు. అధికారులు హెచ్‌ఈవో రవిదాస్, ఉపాధ్యాయుడు చైతన్య కుమార్, ఏఈ శైలేందర్, చౌపన్‌గూడ సర్పంచ్ అన్నిగ, తదితరులు పాల్గొన్నారు.


జైనూర్: దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్న అధికారులు


కౌటాల: తలోడిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

రోడ్డు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ

వాంకిడి: మండలంలోని గోందాపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎంపీపీ ముండె విమలబాయి కలెక్టర్ హేమంత్ బోర్కడేను ఆయన కార్యాలయంలో కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గోందాపూర్ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకుడు దీపక్ ముండె, గ్రామస్తులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని భట్‌పల్లి చౌరస్తాలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పత్తి దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. భట్‌పల్లి చౌరస్తాలో సంతోష్ అనే వ్యాపారి వద్ద నిల్వ ఉన్న పత్తికి ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. సుమారు రూ. 30వేల నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం

బోథ్: ప్రతి ఇంటికీ తాగునీటిని అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామీణ నీటిపారుదల కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం కరత్వాడ వద్ద గల మిషన్ భగీరథ పంప్‌హౌస్‌ను పరిశీలించారు. కంద్రవాగు వద్ద వంతెన నిర్మాణం పనులు ప్రారంభం కావడంతో పక్కనే ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డీఈ దేవయ్య, ఏఈ కల్యాణ్‌లు పాల్గొన్నారు.

'సఖీ' సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ లావణ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో మగ్గం వర్క్, బ్యూటీషియన్ పార్లర్ శిక్షణ కేంద్రంలో అవగాహన కల్పించారు. సఖీ కేంద్రం ద్వారా అందే కౌన్సెలింగ్, న్యాయ, పోలీసు సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి గురించి వివరించారు. మహిళలు, బాలికల చట్టాలు, గృహహింస, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, సైబర్‌క్రైం తదితర వాటి గురించి వివరించారు.

పోచమ్మ ఆలయంలో మొక్కులు

చెన్నూర్: పట్టణంలోని మదనం పోచమ్మ ఆలయంలో శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దంపతులు మొక్కులు చెల్లించారు. ఆయనకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వినోద్ బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందితే అమ్మవారికి మొక్కు చెల్లిస్తామని ఆయన అభిమాని తనుగుల రవికుమార్ మొక్కుకున్నాడు. రవి మొక్కు మేరకు కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు చెల్లించినట్లు ఎమ్మెల్యే వినోద్ తెలిపారు. చెన్నూర్ మదనం పోచమ్మ ప్రజలు చల్లగా చూడాలని కోరుకున్నానన్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం!



దహెగాం: వరి నాట్లు, పత్తితీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలను ప్రైవేటు ఆటో ట్రాలీలు, ట్రాక్టర్‌లు, జీపుల్లో తరలిస్తున్నారు. వాహనాల కెపాసిటీకి మించి కూలీలను తరలిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం పోలీసులు దుప్పట్లు పంపిణీ చేశారు. కాగజ్‌నగర్ పట్టణ సీఐ బుద్దె స్వామి, సీసీఎస్ సీఐ ముత్యాల రాజుల ఆధ్వర్యంలో 125 మంది విద్యార్థులకు నవేగాంబస్తీకి చెందిన వివేకానంద యూత్ సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు కిరణ్, తిరుపతి, మహేందర్, రవి, శ్యాంసుందర్, వెంకటేశ్, మహేశ్, శంకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'వేతనాలు చెల్లించకుంటే కార్యాలయం ముట్టడిస్తాం'


మాట్లాడుతున్న బోగే ఉపేందర్

రెబ్బెన: నర్సరీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించకుంటే ఈనెల 10న డీఎఫ్‌వో కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో నర్సరీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖ నర్సరీల్లో పని చేసిన కార్మికులకు 10నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వేతనాలు చెల్లించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. రేపల్లెవాడ నర్సరీలో పని చేసిన కార్మికులకు సైతం సుమారు రూ.3లక్షల వేతనాలు గత మూడేళ్లుగా చెల్లించడం లేదని ఆరోపించారు. వేతనాల కోసం నెలల తరబడి అటవీశాఖ అధికారులు చుట్టూ తిరుగుతున్నా రేపుమాపు అంటూ కాలయాపన చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. వేతనాల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనంగా రోజుకు కూలీ రూ.600 చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ప్రమాదబీమా రూ. 10లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సరీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘమిత్ర, కార్మికులు సుమలత, సతీశ్, శంకరమ్మ, కవిత, దశరథ్, పెంటయ్య, తార, లక్ష్మి, కమల, నిర్మల పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ నరేశ్

రెబ్బెన: మండలంలోని నారాయణపూర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు, రెబ్బెన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ హైదరాబాద్‌కు చెందిన కళాజాత సంస్థ కళాకారులు బ్యాంకు ద్వారా అందుబాటులో ఉన్న పథకాలు, రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ గొగికార్ నరేశ్, సర్పంచ్ వేమునూరి అమృత, సీఎస్‌పీ పల్లె శ్రీనివాస్, వీవోఏ శంకర్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


కెరమెరి: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రకాశ్

కెరమెరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో పీఆర్‌టీయూ క్యాలెండర్లను శుక్రవారం పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాశ్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెండు మాసాల వేతనాలు అందించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అంతకు ముందు కెరమెరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిన ఆడే ప్రకాశ్‌కు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు భరత్‌రావు, లెవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మండల పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండరు, డైరీలను ఆవిష్కరించారు. సంఘం నాయకులు సదాశివుడు, పురుషోత్తం, లక్ష్మణ్, షేక్‌జావిద్, సుబ్బలక్ష్మి, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్, వెంకటరమణ, మహేష్, అంబారావ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షింతలు పంపిణీ


ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలో అక్షింతలు పంపిణీ చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్/ఆసిఫాబాద్: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం పురస్కరించుకొని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆసిఫాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ, రావులవాడ, జన్కాపూర్, దస్నాపూర్, పైకాజీనగర్‌తో పాటు మండలంలోని సాలెగూడ, బాబాపూర్, గుండి, గోవింద్‌పూర్, చోర్‌పల్లి, రహపల్లి గ్రామాల్లో మహిళలు డ్రెస్‌కోడ్‌తో ఉత్సాహంగా అక్షింతలు పంపిణీ చేశారు. అక్షింతల కార్యక్రమం ఈ నెల 15 వరకు కొనసాగుతుందని సంయోజక్ ఇరుకుల్ల అంజనేయలు తెలిపారు. కమిటీ ప్రతినిధులు సతీశ్ బాబు, వేణుగోపాల్, వెంకన్న, కోటేశ్వర్ రావు, మధూకర్, విశాల్, శ్రీనివాస్, శ్రీరామ్ శ్రీరాములు ఉన్నారు.

దహెగాం: ఈనెల 24న అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు. స్థానిక శివాలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గత మూడు రోజుల నుంచి మండల కేంద్రంలోని వాడల్లో అందజేస్తున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.


దహెగాం: అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

రెబ్బెన: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య పూజిత అక్షింతల మహాశోభాయాత్రను శుక్రవారం మండలంలోని గోలేటిలో కన్నుల పండువగా నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో గోలేటి విలేజ్‌లోని హనుమాన్ ఆలయం నుంచి భక్తులు గోలేటి టౌన్‌షిప్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. తీర్థ ట్రస్ట్ గోలేటి కార్యదర్శి సంతోష్ శర్మ, సహా సంయోజక్ విజయ్‌కుమార్, సభ్యులు విలాస్, అక్కిరాజ్, భీమేష్, రాజేష్, సత్యనారాయణ, సురేశ్, మహేష్, గోలేటి సర్పంచ్ సుమలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: అయోధ్య శ్రీరామ అక్షింతల శోభాయాత్రను మండలంలోని ఎలుకపెల్లి గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎలుకపెల్లి(బి) ఆలయ కమిటీ అధ్యక్షుడు కొట్రంగి రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులు జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. శ్రీరామ అక్షింతల కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ అక్షింతలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కేశెట్టి శ్రీనివాస్, శ్రీరామ్ మోహన్, మహేందర్, అంజయ్య, రాజబాబు, సత్యం, రాజు తదితరులు పాల్గొన్నారు.


రెబ్బెన: శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


బెజ్జూర్: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు